క్లుప్తంగా

ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు



ముప్పాళ్ళ: ఎరువులు, పురుగుమందులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని, రైతుకు కావాల్సిన మేర మాత్రమే ఎరువులు అందివ్వాలని తహసీల్దార్ కె.నగేష్ చెప్పారు. మండల కేంద్రమైన ముప్పాళ్ళలోని గ్రోమోర్, సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఎరువుల గోదాములును మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డితో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు తనిఖీ చేసి స్టాక్‌ను పరిశీలించారు. రాబోయే రోజుల్లో సాగుకు సరిపడా యూరియా నిల్వలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. దుకాణాల్లో అందరికీ కనిపించేలా స్టాక్ బోర్డు, ధరల పట్టిక ఏర్పాటు చేయాలని, ప్రతి రోజూ వివరాలు అందులో నమోదు చేయాలన్నారు. అక్కడే ఉన్న రైతులతో మాట్లాడి ఎరువుల పంపిణీలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సరిపడా నిల్వలున్నాయని దుకాణదారులు తహసీల్దార్‌కు వివరించారు. కార్యక్రమంలో వీఆర్వో రస్కిన్, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే విక్రయించాలి



నకరికల్లు: నిర్ణీత ధర కన్నా అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కె.పుల్లారావు హెచ్చరించారు. మండల వ్యవసాయాధికారి కె.దేవదాసుతో కలిసి స్థానిక ఎరువుల దుకాణాల్లో మంగళవారం ఆయన తనిఖీలు చేపట్టారు. రికార్డులు తనిఖీ చేసి, ఎరువుల నిల్వలు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఎమ్మార్పీ ధరను మించి ఎరువులను విక్రయిస్తే ఎఫ్‌సీఓ 1985 చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. దిగుమతి బిల్లులు, క్రయవిక్రయాల రసీదులు సక్రమంగా ఉండాలన్నారు. రైతులకు ఇచ్చే రసీదుల్లో అమ్మకందారు, కొనుగోలుదారుల సంతకాలు ఉండాలన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

బాబు మోసాలపై ఇంటింటా ప్రచారం



రాజుపాలెం: కూటమి ప్రభుత్వం చేసే మోసాలను ప్రజలకు తెలియపరిచేందుకే బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తూరు గ్రామంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమన్వయకర్త డాక్టర్ సుధీర్‌భార్గవ్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి బాబు మోసాలపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. ఆయన వెంట ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీతాశ్రీనివాసరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి సుబ్బారెడ్డి, కార్యదర్శి ఎస్కే బాషా, సర్పంచ్ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాశం శ్రీనివాసరెడ్డి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ఎస్కే జానీ తదితరులు ఉన్నారు.

మరమ్మతులు మూణ్నాళ్ల... ముచ్చటేనా..!





పెదకూరపాడు కాలచక్ర రోడ్డుపై ఇటీవల మరమ్మతులు చేసిన చోట మళ్లీ గుంతలు పడిన వైనం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎంతో హడావుడిగా పల్లెపండగ పేరుతో చేపట్టిన రోడ్ల మరమ్మతులు మూణ్నాళ్ల... ముచ్చటగా మారాయి. సత్తెనపల్లి–అమరావతి వయా పెదకూరపాడు మీదగా వెళ్లే కాలచక్ర రహదారిపై పలు ప్రాంతాల్లో మరమ్మతులు చేశారు. అయితే మళ్లీ ఈ రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. ఇసుక రవాణాలో భాగంగా ఈ రహదారిపై నిత్యం పెద్ద సంఖ్యలో భారీ వాహనాలు తిరుగుతుంటాయి. దీంతో మరమ్మతులు చేసిన ప్రాంతాల్లో రోడ్డు కుంగిపోయి, గుంతలు ఏర్పడి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. తూతూ మంత్రంగా మరమ్మతులు చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని వాహనదారులు, స్థానికులు వాపోతున్నారు.

– పెదకూరపాడు

చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న చిల్లపల్లి సత్యం, చేనేత కార్మికులు

పెదకూరపాడు: దేశ స్వాతంత్ర్యోద్యమంలో ప్రధాన భూమిక పోషించి, స్వాతంత్ర్య సముపార్జనకు ఒక సాధనంగా నిలిచింది చేనేత అని, ఈ నెల 7న ప్రతి ఒక్కరూ 11వ జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించుకోవాలని జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం పల్నాడు అధ్యక్షుడు చిల్లపల్లి సత్యం అన్నారు. స్థానిక చేనేత సంఘం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో అహింసాయుత ఉద్యమానికి నాంది పలికిన చేనేత రంగానికి ఒక రోజు ఉండాలన్న ఉద్దేశంతో జాతీయ చేనేత దినోత్సవం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విదేశీ వస్త్ర బహిష్కరణలో కీలకపాత్ర వహించిన ఆగస్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా జరుపుకోవడం అభినందనీయమన్నారు. 2015 ఆగస్టు 7న చెన్నైలో ప్రధాని మోదీ చేనేత లోగోను ఆవిష్కరించి, జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించారన్నారు. చేనేత దినోత్సవం ఘనంగా జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అనురాధకు సత్కారం

సత్తెనపల్లి: మండలంలోని రామకృష్ణాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన అనురాధని ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపి, సత్కరించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అద్దంకి బాబు మాదిగ, రాష్ట్ర కార్యదర్శి సత్యానందం మాదిగ, అధికార ప్రతినిధి అశోక్ మాదిగ, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు హిట్లర్ మాదిగ, మండలాల ఇన్‌చార్జ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

మా ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించవద్దు

విద్యుత్ కార్యాలయాలు, సబ్ స్టేషన్‌ల వద్ద ధర్నాలు, వినతిపత్రాల అందజేత



ఏఈ రవికిరణ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం



75 త్యాళ్లూరులో స్మార్ట్ మీటర్ల వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు



క్రోసూరులో అర్జీ అందజేస్తున్న ప్రజా వేదిక సభ్యులు



నకరికల్లులో వినతిపత్రం అందిస్తున్న ప్రజాసంఘాల నాయకులు



చాగంటివారిపాలెంలోని ఏఈకి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

అమరావతి: మా ఇళ్లకు అదానీ స్మార్ట్ మీటర్లు బిగించవద్దు, పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి.. అంటూ నినాదాలతో మంగళవారం ఉభయ కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద వినియోగదారులు, ప్రజా సంఘాల ప్రతినిధులతో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి భైరాపట్నం రామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం షిరిడీ సాయిబాబా కంపెనీతో ఒప్పందాన్ని కొనసాగిస్తూ అదానీ స్మార్ట్ మీటర్లను కొనుగోలు చేసి ఆ భారాన్ని 93 నెలల పాటు సర్ చార్జీల రూపంలో ప్రజలపై మోపుతున్నారన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడుతూ యజమానుల అనుమతి లేకుండా మీటర్ బిగించరాదని విద్యుత్ అధికారులు సిబ్బందికి ఆర్డర్ ఇవ్వాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి ధారా ప్రసాదు మాట్లాడుతూ ఈ స్మార్ట్ మీటర్ల వల్ల బడుగుబలహీన వర్గాల వారు అంధకారంలో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అనంతరం విద్యుత్ ఏఈ రవికిరణ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు, సీపీఐ నాయకులు మునగోటిటి శ్రీనివాసరావు, సీపీఎం నాయకులు సయ్యద్ మొహిద్దీన్‌వలి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలపాటి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రూ అప్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

నకరికల్లు: విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల విధానం అమలును వెనక్కు తీసుకోవాలని పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యుత్ స్మార్ట్‌మీటర్ల విధానం రద్దు చేయాలని స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలంటూ నినాదాలు చేశారు. విద్యుత్‌శాఖ అధికారులకు స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకిస్తున్న వినియోగదారుల సంతకాలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్లు రద్దు చేసేవరకు పోరాడతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు ఈవూరి లక్ష్మారెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి జి.పిచ్చారావు, ఎంసీపీఐయూ జిల్లా సహాయ కార్యదర్శి మణికంఠేశ్వరరావు, ఆర్ఎంఎస్ పార్టీ నాయకుడు చింతపల్లి రాజు, సీఐటీయూ మండల కార్యదర్శి మునీర్, మాలమహానాడు సోషల్ మీడియా ఇన్‌చార్జి గోదా బాల, రామాంజినాయక్, గోవిందునాయక్, కొండానాయక్, చట్టు కోటేశ్వరరావు, వినియోగదారులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నిరసన

ముప్పాళ్ళ: ప్రజలకు విద్యుత్ భారాన్ని అందించే స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని ప్రజలందరూ వ్యతిరేకించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి బాలకృష్ణ అన్నారు. మండలంలోని చాగంటివారిపాలెంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. బాలకృష్ణ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా గ్రామాల్లో సంతకాల సేకరణ చేయడం జరిగిందన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని ప్రజలు ఉద్యమంగా పోరాడి వ్యతిరేకించాలన్నారు. పేద ప్రజలపై భారాలు మోపేందుకు స్మార్ట్ మీటర్లను తీసుకొచ్చి అదానీ లాంటి కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ సంస్థలను కట్టబెట్టేందుకు సిద్ధమైందన్నారు. అనంతరం విద్యుత్ ఏఈ సుచరితకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గారా జాలయ్య, పఠాన్‌సైదాఖాన్, చింతపల్లి నాగేమల్లేశ్వరరావు, సాంబశివరావు, వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు, సత్యనారాయణరెడ్డి, నాగేశ్వరరావు, బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై భారం మోపుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరులో సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగించవద్దని విద్యుత్ కార్యాలయాల వద్ద నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మరింత దోపిడీ చేయడానికి స్మార్ట్ మీటర్ల విధానాన్ని ప్రవేశపెట్టాయని, వినియోగదారులపై అదనపు భారం, భద్రత లేని విద్యుత్ సొకర్యాన్ని ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రధానంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరుతో దేశంలో ప్రతి వినియోగదారుడికి స్మార్ట్ మీటర్లు బిగించాలని రాష్ట్రాలను ఆదేశించి, విద్యుత్ రంగాన్ని ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం చేయడానికి పూనుకుందన్నారు. గతంలో స్మార్ట్ మీటర్ల పగలగొట్టాలని చెప్పిన టీడీపీ నేతలే నేడు మీటర్లు బిగించాలని.. జేబులు నింపుకుంటున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు చల్లపల్లి పానయ్య, దొడ్డ రాజు, వెంకటేశ్వరరావు, ఎస్కే సుభాని, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ ధనలక్ష్మికి వినతిపత్రం అందజేత

విద్యుత్ రంగంలో అదానీ స్మార్ట్ మీటర్లను గృహాలకు అమర్చకుండా నిలుపుదల చేయాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ ఎస్.ధనలక్ష్మికి మంగళవారం డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. స్మార్ట్ మీటర్లు నిలిపివేయాలని, విద్యుత్ సుంకాలను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం విద్యుత్ చార్జీలు తగ్గించాలన్నారు. గత ప్రభుత్వంలో ఈ స్మార్ట్ మీటర్లు వ్యతిరేకించి ఇప్పుడు ఏర్పాటు చేయటం సరైన చర్య కాదన్నారు. షాపులకు అమర్చిన స్మార్ట్ మీటర్లు కూడా వెంటనే తొలగించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు గుంటూరు మల్లేశ్వరి, రైతు సంఘం పెదకూరపాడు అధ్యక్షులు ఎం.మస్తాన్‌రావు, ప్రతినిధులు శ్రీనివాసరావు, మంగమ్మ, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ అర్జీ అందజేత

క్రోసూరు: రాష్ట్ర వ్యాప్తంగా ప్రజావేదికల ఆధ్వర్యంలో గృహాలకు అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగించటాన్ని వ్యతిరేకిస్తూ నిరసన చేపట్టి అక్కడి అధికారులకు మెమోరాండంలు అందజేశారు. మండలం కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద, మండలంలోని అన్ని గ్రామాల సచివాలయాల్లో ప్రజావేదిక సభ్యులు మెమోరాండంలు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజావేదికల సభ్యుడు తిమ్మిసెట్టి హనుమంతరావు మాట్లాడుతూ ప్రజల ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించి ప్రజలపై భారం వేస్తున్నారని మండిపడ్డారు. రీచార్జి చేసుకుంటేనే విద్యుత్ సరఫరా అవుతుందని, అంతేకాక విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం వేసి ప్రయివేటు కంపెనీలను బాగుచేస్తున్నారని అన్నారు. ఇప్పటికే ట్రూ అప్ చార్జీల భారం ప్రజలపై వేసారని, వీటన్నింటిని వ్యతిరేకించాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ప్రజావేదిక సభ్యులు టి.హనుమంతరావు, పి.నాగేశ్వరరావు, యాదగిరి, అంజి, అంకమ్మ, రాము, అప్పారావు, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో దోపిడీకి గురికానున్న వినియోగదారులు

సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్



పట్టణ 3వ వార్డు సచివాలయ సిబ్బందికి వినతి పత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు



రెంటపాళ్ల సచివాలయంలో వినతిపత్రం అందిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సత్తెనపల్లి: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను పగలగొట్టండని లోకేష్ పిలుపునిచ్చాడని, అధికారంలోకి రాగానే ఎందుకు యూ టర్న్ తీసుకున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ ప్రశ్నించారు. అదానీ స్మార్ట్ మీటర్లను ఇళ్లకు పెట్టవద్దని, ట్రూ అప్ చార్జీల భారాలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలని పట్టణంలోని 3వ వార్డు సచివాలయ సిబ్బందికి మంగళవారం సీపీఎం వార్డు శాఖ కార్యదర్శి దాసరి ఉమామహేశ్వరరావు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఏడాదిలోనే విద్యుత్ చార్జీలు గణనీయంగా కూటమి ప్రభుత్వం పెంచిందని, మళ్లీ పెంచేందుకు ప్రయత్నాలు చేస్తుందన్నారు. స్మార్ట్ మీటర్లతో వినియోగదారులను దోచుకుంటుందని, అదనపు లోడ్ పేరుతో డిపాజిట్లుగా భారీ మొత్తాన్ని గుంజుతుందన్నారు. సెల్‌ఫోన్ తరహాలో ముందుగా సొమ్ము చెల్లించి రీచార్జి చేయించుకోవాలని, స్మార్ట్ మీటర్ ఖర్చు సింగిల్ ఫేజ్‌కు రూ.9 వేలు, త్రీ ఫేజ్‌కు రూ.17 వేలు 93 నెలల వాయిదా పద్ధతిలో వినియోగదారుల నుంచి వసూలు చేస్తారన్నారు. తక్షణమే స్మార్ట్ మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలని, పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని పలు సచివాలయాల్లో సీపీఎం నాయకులు వినతిపత్రాలు అందించారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఎం రాష్ట్ర మాజీ కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య, నాయకులు గద్దె ఉమశ్రీ, జడ రాజకుమార్, చెన్నయ్య, భాస్కరరావు, వెంకట్రావు, హరి పోతురాజు తదితరులు ఉన్నారు.

ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తే బిల్లుల భారం తప్పదు

ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తే మోయలేనంతగా బిల్లుల భారం తప్పదని ప్రజా సంఘాల ఐక్యవేదిక సత్తెనపల్లి కన్వీనర్ పెండ్యాల మహేష్ అన్నారు. అదానీ స్మార్ట్ మీటర్లు ఇళ్లకు పెట్టవద్దని, ట్రూ అప్ చార్జీలు, అదనపు భారాలు తగించాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని రెంటపాళ్ల, ఫణిదం, కందులవారిపాలెం సచివాలయాల్లో వినతిపత్రాలు అందించారు. పెండ్యాల మహేష్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం మాట తప్పి, విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపి నమ్మకద్రోహం చేసిందని విమర్శించారు. 2023 జూలై 2వ తేదీన నెల్లూరులో నారా లోకేష్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టండని పిలుపునిచ్చారని, ఆ పిలుపుకు నేడు కట్టుబడి ఉన్నారో లేదో ప్రజలకు తెలపాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్కరణల పేరుతో కార్పొరేట్లకు కట్టబెట్టడానికి చేస్తున్న కుట్రలను ప్రజలు అడ్డుకోవాలని, ప్రజా సంఘాలు అండగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు రావూరి పూర్ణచంద్రరావు, షేక్ హుస్సేన్ సా, రామారావు, జై భగత్, శివరావు, అనూష, సుజాత, అమూల్య, వీరబ్రహ్మం, తాతారావు, మరియదాసు, లక్ష్మీనారాయణ, వెంకటనారాయణ పాల్గొన్నారు.

శిశువుకు తల్లిపాలు శ్రేయస్కరం



పట్టణ ఏరియా వైద్యశాలలో డాక్టర్ సుజాత, లయన్స్ క్లబ్ బాధ్యులు



తల్లిపాలపై అవగాహన ర్యాలీలో సూపర్‌వైజర్ పద్మ, అంగన్‌వాడీలు



దమ్మాలపాడులో...

సత్తెనపల్లి: శిశువుకు తల్లిపాలు పట్టడం శ్రేయస్కరమని డాక్టర్ సుజాత అన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి టౌన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో బాలింతలకు రొట్టెలు, పండ్లు, మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుజాత మాట్లాడుతూ తల్లిపాలు ఇవ్వడం ద్వారా బిడ్డ ఆరోగ్యంగా ఉండడంతో పాటు తల్లికి క్యాన్సర్ లాంటి వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందన్నారు. ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వీరాంజనేయులు, కిషోర్ బాబు, పెద్దింటి వెంకటేశ్వర్లు, భావనారాయణ, రాజశేఖర్, రోశయ్య, రమేష్‌బాబు పాల్గొన్నారు.

కొండూరులో తల్లిపాల వారోత్సవాలు

పెదకూరపాడు (అచ్చంపేట): తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని క్రోసూరు సెక్టార్ సూపర్‌వైజర్ పద్మ అన్నారు. అచ్చంపేట మండలంలోని కొండూరు గ్రామంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లులకు అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.జయలక్ష్మి పాల్గొని బిడ్డకు ముర్రుపాల ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు, గర్భిణులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో ఖర్చు తక్కువ.. ఆదాయం ఎక్కువ

ప్రకృతి వ్యవసాయ శిక్షణ పల్నాడు జిల్లా అడిషనల్ ప్రాజెక్టు మేనేజర్ ప్రేమరాజు



మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ ప్రాజెక్టు మేనేజర్ ప్రేమరాజు


నకరికల్లు: పంటలకు రసాయనాలు వాడడం ద్వారా భూమి ఆరోగ్యం దెబ్బ తింటుందని ప్రకృతి వ్యవసాయ శిక్షణ పల్నాడు జిల్లా అడిషనల్ ప్రాజెక్టు మేనేజర్ ప్రేమరాజు అన్నారు. నకరికల్లు, కారంపూడి మండలాల వీఏఏ, వీహెచ్ఏ, వ్యవసాయ సిబ్బందికి ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక రైతు సేవ కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలను సాగు చేసే రైతులకు ప్రకృతి వ్యవసాయ, వ్యవసాయ శాఖ అధికారుల భాగస్వామ్యం అవసరమన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగులో ఖర్చు తగ్గి ఆదాయం పెరుగుతుందని, అలాగే భూమిలో నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం, పంట నాణ్యత, తెగుళ్లను తట్టుకునే సామర్థ్యం పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఏవో కె.దేవదాసు, మాస్టర్ ట్రైనర్ బాజిబాబు, సుబ్బారెడ్డి, మోడల్ మేకర్ హసీనా, యూనిట్ ఇన్‌చార్జిలు రామసుబ్బారెడ్డి, జ్యోతి, రమేష్, వీఏఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

లైబ్రరీ నిర్మాణానికి స్థలం కేటాయించాలి



సత్తెనపల్లి: మండలంలోని లక్కరాజుగార్లపాడు గ్రామంలో సర్వేనెంబర్ 114లోని బావి పోరంబోకు స్థలంలోని 0.06 సెంట్ల భూమిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరుతో లైబ్రరీ, మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాల ఏర్పాటుకు, ఆ స్థలం కేటాయించాలని గ్రామస్తుడు జొన్నలగడ్డ వెంకట్రావు, ఎస్సీ కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నాయకులు, ఎస్సీ కాలనీవాసులు సత్తెనపల్లి ఆర్డీవో జీవీ రమనాకాంతరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జొన్నలగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యాలయ పరిధిలో మాజీ సర్పంచ్ కొండవీటి కృష్ణారావు, మహాత్మాగాంధీ, సుభాష్ చంద్ర బోస్, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, ఎన్టీ రామారావు, మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహాలు ఉన్నాయని, అదే స్ఫూర్తితో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు మీద లైబ్రరీ, మహాత్ముల విగ్రహాల నిర్మాణం కోసం పోరంబాకు స్థలంలోని 0.06 సెంట్ల భూమిని కేటాయించాలన్నారు. ఇప్పటికే ఈ స్థలం పై విచారణ జరిపి పూర్తి విచారణ నివేదికను, సంబంధిత స్టేట్‌మెంట్లు, క్షేత్రస్థాయి విచారణ ఫోటోలు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కి, మండల సర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారి అందించడం జరిగిందన్నారు. తాము దశాబ్దాలుగా నడుస్తున్న దారిని ప్రస్తుత అధికార పార్టీకి చెందిన వ్యక్తులు మట్టితోవి దారికి అడ్డంగా వేశారన్నారు. దీనిపై తహసీల్దార్‌కు అర్జీ దాఖలు చేయగా వీఆర్వో, ఆర్ఐ విచారణ చేసి ఎండార్స్‌మెంట్ కూడా ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, గ్రామంలోని ఎస్సీ కాలనీ వాసులు ఉన్నారు.

ఉపాధి హామీ సిబ్బందికి ఒకరోజు శిక్షణ



క్రోసూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అమరావతి, పెదకూరపాడు, అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాల మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఏపీవో బి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జియో ట్యాగింగ్, జియో ఫెన్సింగ్ మొబైల్ యాప్ వినియోగంపై శిక్షణనిచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో జి.రవికుమార్ ప్రారంభించగా డిపార్ట్‌మెంట్ విజిలెన్స్ ఆఫీసర్ (ఫైనాన్స్ మేనేజర్) హీరాలాల్, సత్తెనపల్లి ఇన్‌చార్జి ఏపీడీ పి.వెంకటనారాయణ సారథ్యం వహించారు. ఈ కార్యక్రమంలో జేఈ రమణమూర్తి, ఈసీ హరిత, టీఏలు , చిరంజీవి, డీఆర్పీలు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.